
# డాం!

మైనంపాటి భాస్కర్



బీదవాడు. పాపం, మహా బీదవాడు!

అంచేత అతని క్షోభ చూళ్లేక అతని కష్టాలు కడతేర్చడానిగ్గానూ మహామంత్రిగారు 'రాజు వెడలె రవి తేజము లలరగ' అన్నంత లెవెల్లో బయలుదేరి వచ్చారు.

బీదవాణ్ని ఎగాదిగా చూసి, "ఏంటి నీ కష్టం?" అని అడిగాడు మహామంత్రిగారు.

"అయ్యా! ఆకలి!" అన్నాడు బీదవాడు విలవిలల్లాడుతూ.

"అయితే నీ కష్టాలు కడతేర్చడానిగ్గానూ, ప్రణాళిక వేయడానిగ్గానూ, విదేశాల కెళ్లి స్టడీ చెయ్యడానిగ్గానూ ఇప్పుడే బయలుదేరుతున్నా!" అని తిమింగలంలా ఉన్న ఎయిర్‌ఫోర్సు జెట్ విమానంలో తన సొంత వందిమాగధుల్ని ఎక్కించుకుని అర్జెంటుగా అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండు, ఇథియోపియా, రష్యా, ఫిన్లాండ్ వగైరా దేశాలన్నీ అవన్నీ అడ్డగోలుగా తిరిగి రావడాని కెళ్లిపోయాడు సదరు మహామంత్రివర్యులు గారు.

అయ నటెళ్లగానే ఇంకో రాజకీయవాది వంచె ఎగదోసుకుంటూ పరుగెత్తు కొచ్చాడు. అతగాడు అధికారపక్షంలోనే అసమ్మతివర్గం తాలూకు!

"ఏమిటి నీ కష్టం?" అన్నాడు అసమ్మతివర్గం తాలూకాయన.

"అయ్యా! ఇంటిల్లిపాదికీ ఆకలి, దప్పిక!" అన్నాడు బీదవాడు.

"చూశావా! మా అసమ్మతివర్గం వాళ్లని అందలం ఎక్కించి పదవు లివ్వకపోతే మీ గతి ఇట్లా అధోగతే!" అన్నాడు అసమ్మతివర్గం నాయకుడు పళ్లు పటపట కొరుకుతూ.

అత నెళ్లగానే పెద్ద ప్రతిపక్షం తాలూకు పెద్దాయన వచ్చాడు.

"అహెూ! ఏమిటి తమరి కష్టం?" అన్నాడు అట్టహాసంగా.

"అయ్యా! బాబూ! ఆకలి! దప్పిక! పిల్లదానికి పా ల్లేవు!" అన్నాడు బీదవాడు.

పెద్ద ప్రతిపక్షం తాలూకు పెద్దాయన చెంపకు చెయ్యి చేర్చి భారీగా ఆలోచించాడు.

"అహెూ! తట్టింది! నీ కష్టా లన్నిటికీ పరిష్కారం కనిపెట్టేశా!" అన్నాడు ప్రతిపక్షం పెద్దాయన.

బీదవాడు ఆశగా పత్తికాయలంత కళ్లు చేసుకుని చూస్తూ, అన్నాడు - "ఏంటది?"

"ఇవ్వాళ నుంచే నా హెయిర్ స్టయిల్ మార్చేస్తా! నా జుట్టుకి నల్లరంగు బదులు ఆకుపచ్చ రంగేస్తా!" అన్నాడు ప్రతిపక్షం పెద్దాయన. అంటూనే కొత్త రకం హెయిర్ డ్రై కొనుక్కోవడానిగ్గానూ పరుగెత్తు కెళ్లాడు.

ఆ తర్వాత -

దేవుడి పార్టీ వాళ్లు వచ్చారు.

"ఏమిటి కష్టం?" అని విచారించారు.

"అయ్యా! ఆకలి! దాహం! పిల్లదానికి పాల్లేవు. పిల్లాడికి చదువుకునేందుకు పుస్తకా ల్లేవు" అన్నాడు బీదవాడు.

"అవును మరి! ఫలానచోట గుడి కట్టించకపోతే నీ కష్టా లెట్లా తీరుతాయి చెప్పూ!" అన్నాడు దేవుడి పార్టీ అయన జాలిగా చూస్తూ.

ఆయన ఫే డవుటైపోగానే ఇంకో దేవుడు పార్టీ వాళ్లు ఫ్రేములోకి వచ్చేశారు.

బీదవాడు నోరు తెరిచి కష్టాలు చెప్పుకునేలోగానే వాళ్లు చెలరేగిపోతూ, "ఈ దేశాన్ని ముక్కచెక్కలు చేస్తేగానీ ముదనష్టం వదల్దు! మాకు వేరే దేశం కావాలి. అలాగని పై దేశం నుంచి ఆదేశం వచ్చింది! అప్పటిగ్గానీ కష్టాలు తీరవు!" అన్నారు ఆవేశంగా.

వాళ్లు వెళ్లగానే హేతువాద మతం ఆయన వచ్చాడు.

"ఏమిటి నీ కష్టం?" అన్నాడు హేతువాది.

"ఆకలి! దప్పిక! పిల్లదానికి పాలు! పిల్లగాడికి పుస్తకాలు! మా ఆడదానికిమందులు!" అన్నాడు బీదవాడు.

"ఈ పిల్లలు నీ పిల్లలే అని రుజు వేమిటి? ఈమె నీ పెళ్లామే అని రుజు వేమిటి? నే

న్నమ్మను?'' అన్నాడు హేతువాది.
"అయ్యో! అందరూ చూస్తూండగా ఆవిడ మెళ్లో తాళిబొట్టు కట్టానండీ, బాబూ!'' అన్నాడు బీదవాడు లబలబలాడుతూ.
"అయితే మాత్రం, ఈ పిల్లలు నీకే పుట్టారని రుజు వేమిటి? నే న్నమ్మను!'' అన్నాడు హేతువాది.
"మీ కేమన్నా పిచ్చా?'' అన్నాడు బీదవాడు కోపంగా.
"నువ్వూ, నీ పెళ్లాం పడుకుని ఉండగా చూసిన వా ళ్లెవరైనా ఉన్నారా? లేకపోతే నే న్నమ్మను!'' అన్నాడు హేతువాది ఫైనల్‌గా.
బీదవాడు బిక్కచచ్చిపోయాడు.
"అందుకనే బాబాల బండారం బట్టబయలు చేస్తే తప్ప నువ్వు బాగుపడవు. లక్షరూపాయలు పందెం!'' అని చిరచిర లాడుతూ వెళ్లిపోయాడు హేతువాది.
అత నెళ్లగానే ఓ సోషల్ సర్వీసు బాపతు కుర్రాడు వచ్చాడు. వాళ్ల నాన్న బ్లాక్ మార్కెట్లో కోట్లు కోట్లు సంపాదించేయగా, ఆ కుర్రాడు సర్దాగా అమెరికాలో చదువుకుని తిరిగి వచ్చి, సొసైటీలో పేరు కోసం నుతారంగా అప్పుడప్పుడూ సోషల్ సర్వీస్ చేస్తూంటాడు.
"వ్వాట్ మాన్! వా టీజ్ యువర్ ట్రబుల్?'' అన్నాడు అచ్చుతెలుగుని శుద్ధ ఇంగ్లీషులో మాట్లాడుతూ.
బిచ్చగాడు. తనకు అలవాటైపోయిన లిస్టు చదివాడు.
సోషల్ సర్వీస్ కుర్రాడి మొహం ఆర్క్ లైట్‌లా వెలిగిపోయింది.
"యా! తట్టింది! వండ్రఫుల్ ఐడియా! రన్ ఫర్ హంగర్! ఆకలి కోసం పరుగు! అన్ని కాన్వెంటుల్లో నుంచి ఓ ఫైవ్ థౌజండ్ చిల్డ్రన్‌ని తీసుకొద్దాం! మా జింఖానా వాళ్లు కూడా వస్తారు. టాంక్ బండ్ ఈ చివర నుంచి ఆ చివర దాకా రన్! స్లోగన్లు ప్రింట్ చేసిన బనీన్లు పంచుతాం! కర్టెసీ ఓ కూల్ డ్రింక్ కంపెనీ! మధ్యలో ఐస్క్రీమ్‌లు! కర్టెసీ ఓ సిగరెట్ల కంపెనీ! రన్‌ని స్పాన్సర్ చేసేదేమో ఓ ఇంటర్నేషనల్ కంపెనీ? వండ్రఫుల్ మీద థండ్రఫుల్!'' అన్నాడు అప్పుడే మారుతీ కారులో రన్ మొదలెట్టేస్తూ.
అతను కారులో పరుగెత్తు కెళ్లిపోగానే తీవ్రవాది వచ్చాడు.
"అన్నా! ఏమిటి నీ కష్టం?'' అన్నాడు ఆర్తిగా.
"ఆకలి! దాహం! పాలు! పుస్తకాలు! మందులు!'' అన్నాడు బీదవాడు.
తీవ్రవాది నొచ్చుకుంటూ చూశాడు.
"నీ కష్టాలన్నీ తీరతాయి! అందుకే నీ కొడుకుని కిడ్నాప్ చేశా!'' అన్నాడు.
"హా! నా కొడుకుని కిడ్నాప్ చేశావా? ఎందుకూ?'' అన్నాడు బీదవాడు కొయ్యబారిపోతూ.
"దాని కో సిద్ధాంతం ఉందిలే! సిద్ధాంతం! ఎక్కడో కొడితే ఇంకెక్కడో మూతి పళ్లు రాలాలి! అంతటితో ఊర్కున్నానా ఏం? నీ కష్టాలు తీర్చడానికిగానూ నిన్నట్నుంచి నాలుగు బస్సులు తగలబెట్టా! ఇవాళో, రేపో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ పడగొట్టా! వెళ్లొస్తా!'' అన్నాడు తీవ్రవాది. పాపం, అతని మొహంలో నిజాయితీ కనబడుతోంది గానీ, గమ్యం తెలిసీ, మార్గం తెలియనివాడిలా దారి తప్పిన తమ్ముళ్లా ఉన్నా డతను.
అత నట్లా వెళ్లగానే పెను వేగంతో టెర్రరిస్టు వచ్చాడు.
"నాన్నకు! నా కనహ్యాం! నీ కష్ట మేమిటో అర్జెంటుగా చెప్పు!'' అన్నాడు అసహనంగా.
బీదవాడికి శోక వచ్చేసింది.
"ఆకలి! దాహం! పాలు! పుస్తకాలు! మందులు! తలదాచుకోడానికి గూడు! కట్టుకోడానికి గుడ్డ!'' అన్నాడు నీరసనంగా.
"చాల్చాలు! ఇంక చెప్పకు! నాకు వినే ఓపిక లేదు. అందుకే అన్నిటికీ సిద్ధంగా వచ్చా! నీ కష్టాలకి విర్గుడు తెచ్చా!'' అంటూనే ఓ పెద్ద బాంబు తీసి బీదవాడి మీద వేశాడు టెర్రరిస్టు.
దాన్తో బీదవాడూ, బీదవాడి పెళ్లాం, బీదవాడి పిల్లలూ ఢామ్మని చచ్చిపోయారు!
దాన్తో వాళ్ల కష్టాలన్నీ తీరిపోయాయి!

నీతి : బీదవాడి కష్టాలు కడతేర్చడం కంటే బీదవాడినే కడతేర్చడం తేలిక!

★



## కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

చక్కని చిక్కని కుటుంబ వ్యవస్థ భగవంతు డిచ్చిన ఒక అందమైన వరం. దాన్ని ప్రత్యేకంగా మనం కాపాడుకోవాలి. ప్రేమించడంలోని నిజమైన ఆనందం కాని, ప్రశాంతి కానీ కుటుంబంలోనే ప్రారంభమవుతాయి. కనుక తల్లిదండ్రులు కలిసి ఉండటంలోని ఆనందాన్ని పిల్లలకు తెలియచెప్పాలి అని పిలుపునిచ్చారు మదర్ థెరిసా. కుటుంబ సమస్యలను తీర్చేందుకు ఉద్దేశించిన ఫామిలీ కౌన్సిలర్స్ నెల్లాళ్ల శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తూ మదర్ థెరిసా "ఆందోళనా భరితమై చెదిరిపోతున్న ప్రస్తుత భారత సమాజం పటిష్ఠమైన తన కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకోవడం చాలా అవసరం'' అని నొక్కి చెప్పా రావిడ.

